# ప్రణాళికాబద్ధంగా పరీక్ష రాయాలి

- ప్రధాన ప్రశ్నలపై గురి పెట్టాలి
- మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న అధ్యాపకులు

**కపిలేశ్వరపురం:** ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షల టైమ్ టేబుల్ ప్రకటించారు. మార్చి 1 నుంచి 19 వరకూ ప్రథమ, 2 నుంచి 20 వరకూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు థియరీ పరీక్షలు రాయనున్నారు. సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 11 కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. 90 శాతం సిలబస్ పూర్తికావడం, సమయం తక్కువ కావడం, పాఠ్యాంశాల్లో మార్కుల ప్రాధాన్యతలపై విద్యార్థులకు అధ్యాపకుల సూచనలు, సలహాలు ఇలా...


అంగర కళాశాలలో చదువుకుంటున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులు

### షెడ్యూల్‌లో ప్రధాన పరీక్షలు ఇలా..

| సబ్జెక్టు | ప్రథమ | ద్వితీయ |
|---|---|---|
| సెకండ్ లాంగ్వేజ్ | మార్చి 01 | మార్చి 02 |
| ఇంగ్లిష్ | 04 | 05 |
| మేథ్స్ ఎ | 06 | 07 |
| బోటనీ | 06 | 07 |
| సివిక్స్ | 06 | 07 |
| మేథ్స్ బి | 09 | 11 |
| జువాలజీ | 09 | 11 |
| హిస్టరీ | 09 | 11 |
| ఫిజిక్స్ | 12 | 13 |
| ఎకనామిక్స్ | 12 | 13 |
| కెమిస్ట్రీ | 14 | 15 |
| కామర్స్ | 14 | 15 |
| సోషియాలజీ | 14 | 15 |

### లాంగ్వేజ్ సబ్జెక్టులపై దృష్టి సారించాలి


ఇంటర్మీడియెట్ మొత్తం మార్కుల్లో లాంగ్వేజ్ సబ్జెక్టుల మార్కులు సైతం కలుస్తాయి. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గ్రామర్‌కూ, ప్రశ్నా జవాబులకూ సమ ప్రాధాన్యత ఇవ్వాలి. తెలుగు ఫస్ట్ ఇయర్‌లో నందీశ్వరుని శాపం, కపాల మోక్షం, అప్పుడే పుట్టి ఉంటే, గాన శుభాకరుడు మంగళంపల్లి, కుంకుడాకు, హెచ్చరిక పాఠాలను, ద్వితీయ సంవత్సరంలో శాంతి కాంక్ష, కర్మభూమిలో పూసిన ఓ పువ్వా, మన ఆటలు, వేమన కవిత్వంలను చదువుకోవాలి. **-టి.కాంచన, తెలుగు అధ్యాపకురాలు, ఆలమూరు**

### పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంది


లెక్కల్లో అన్నింటికీ సమ ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా 75 మార్కులనూ పొందే అవకాశం ఉంది. మేథ్స్- 1ఎలో మాత్రికలు, ప్రమేయాలు, త్రికోణమితి, నిష్పత్తులు, పరివర్తనాలు, త్రిభుజ ధర్మాలు, సదిశల సంకలనం, సదిశల గుణనం, అతి పరావలయ ప్రమేయాలకు, 2-ఎలో డీమూవర్స్ థీరం, సంభావ్యత, యాదృశ్చిక చలరాశులు, ద్విపద సిద్ధాంతంలకు ప్రాధాన్యత ఇవ్వాలి.
**-గ్రంధి సురేష్, మేథ్స్ అధ్యాపకుడు, అంగర**

### వ్యాసరూప ప్రశ్నలపై దృష్టి సారించాలి


ప్రథమ సంవత్సరంలో డోలనాలు, ఉష్ణగతిక శాస్త్రం, పని-శక్తి, సామర్థ్యం, పదార్థ ఉష్ణ ధర్మాల నుంచి ఎనిమిది మార్కుల ప్రశ్నలు వస్తాయి. ద్వితీయ సంవత్సరంలో కేంద్రకాలు, తరంగాలు, ప్రవాహ విద్యుత్ పాఠ్యాంశాల నుంచి వ్యాసరూప ప్రశ్నలూ, మిగిలినవన్నింటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలొస్తుంటాయి.
**-సీహెచ్ రాంబాబు, ఫిజిక్స్ అధ్యాపకుడు, అంగర**

### కార్బన రసాయన శాస్త్రానికి ప్రాధాన్యం ఇవ్వాలి


ఫస్టియర్‌లో పర్యావరణ రసాయన శాస్త్రం, సెకండియర్‌లో లోహ నిష్కర్షణలో సాధారణ సూత్రాలు, పాలిమర్‌లు, నిత్య జీవితంలో రసాయన శాస్త్రాలపై దృష్టి సారించాలి. వాటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలొస్తాయి. ఫస్టియర్‌లో కార్బన రసాయన శాస్త్రం, మూలకాల వర్గీకరణ- ఉపవర్తన ధర్మాలు, పరమాణు నిర్మాణం, సెకండియర్‌లో విద్యుత్ రసాయశాస్త్రం- రసాయనిక గతిక శాత్రం, పి.బ్లాక్ మూలకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.
**-పసగడుగుల గణేష్, కెమిస్ట్రీ అధ్యాపకుడు, మండపేట**

### ముఖ్యమైన చాప్టర్లపై దృష్టి పెట్టాలి


ఫస్టియర్ రాజనీతి శాస్త్రంలో పరిధి స్వభావం, జాతి- జాతీయత, హక్కులు బాధ్యతలు, ప్రజాస్వామ్యం, ప్రభుత్వంలపై దృష్టి సారించాలి. సెకండియర్‌లో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు-ఆదేశిక సూత్రాలు, కేంద్ర కార్య నిర్వాహక శాఖ, కేంద్ర శాసన నిర్మాణ శాఖ, భారత దేశంలో స్థానిక, ప్రభుత్వాలు, ఏపీ, భారతదేశంలలో ఇటీవల పరిణామాలపై దృష్టి సారించాలి.
**-మేడపాటి తమ్మిరాజు, పౌరశాస్త్ర అధ్యాపకుడు, నదురుబాద**

### తప్పనిసరి బొమ్మలు వేయాలి


జువాలజీ, బోటనీ సబ్జెక్టుల్లో చిత్ర పటాలు తప్పనిసరిగా వేయాలి. జువాలజీ ఫస్టియర్‌లో మానవ సంక్షేమం అభివృద్ధి అంశం 8, 4, 2 ప్రశ్నలు మొత్తంగా సుమారు 14 మార్కులు వస్తాయి. పెరిప్లనేటా, అమెరికానా అంశంలో 8, 4 ప్రశ్నలొస్తాయి. సెకండియర్‌లో జీవ పరిణామం నుంచి పది మార్కులు వస్తాయి. రక్త ప్రసరణ వ్యవస్థ, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, జన్యుశాస్త్రం వంటి వాటిపై విద్యార్థులు దృష్టి పెట్టాలి.
**మేడిశెట్టి శ్రీనివాస్, జువాలజీ అధ్యాపకుడు, మండపేట**

### కామర్స్‌లో స్కోరింగ్‌కు అవకాశం


కామర్స్‌లో అధిక మార్కులు సాధించే అవకాశం మెండుగా ఉంటుంది. థియరీ రాయడంతో పాటు పట్టికలను తప్పులు లేకుండా వేయడం ద్వారా మంచి మార్కులు వస్తాయి. ఫస్టియర్‌లో సొంత వ్యాపారం భాగస్వామ్యం, కంపెనీ నమోదు, వ్యాపార విత్తం -1 అంశాల నుంచి పది మార్కులు ప్రశ్నలు వస్తున్నాయి. సెకండియర్ ఎంటర్‌ప్రెన్యూర్ అంశం నుంచి సుమారు 14 మార్కులు, వ్యాపార సేవలు 19, విదేశీ వ్యాపారం 12 మార్కులు వస్తున్నాయి.
**-ఎస్ఎస్‌వీ శ్రీనివాస్, కామర్స్ అధ్యాపకుడు, మండపేట**

## జగనన్న పాలన ఓ సువర్ణాధ్యాయం

- ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్
- వైఎస్సార్ సీపీలో చేరిన 50 మంది టీడీపీ, జనసేన శ్రేణులు

**కాజులూరు:** రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ఓ సువర్ణాధ్యాయమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం మండలంలోని శీలలో స్థానిక నాయకుడు కుంచనపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్ పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై జనసేన, టీడీపీ నుంచి నుంచి అనేక మంది వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. పార్టీలోకి చేరిన కుంచనపల్లి సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించేలా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, సర్పంచ్ కోమలి వెంకటరమణ, కాజులూరు సర్పంచ్ దండంగి సరోజినిచిన్నారావు, నాయకులు దాస్యం సుమన్, కాదా నాగరాజు, కట్టా రమశేఖర్, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


శీలలో వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎంపీ బోస్

## జగనన్నతోనే సంక్షేమ పాలన

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్
- మండలంలో కో-ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ పర్యటన

**కాజులూరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం మండలంలోని కోలంక, పెదలంక, శీల, ఒంటితాడి గ్రామాల్లో ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పర్యటించారు. ఈ సందర్భంగా కోలంకలో ఎంపీ బోస్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పథకాలు రూపొందించడమే కాకుండా, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయడంలో సఫలీకృతులయ్యారన్నారు. టీడీపీ పాలనలో రుణమాఫీ చేస్తామని రైతులు, డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. అప్పులకు వడ్డీలు తీర్చలేక ప్రజలు సతమతమయ్యారన్నారు. సీఎం జగనన్న అధికారం చేపట్టాక, బ్యాంకు రుణాన్ని నాలుగు విడతల్లో ఖాతాలకు చెల్లించారని పేర్కొన్నారు. మరలా టీడీపీ, జనసేన నాయకులు అబద్ధపు హామీలతో మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు వారిని నమ్మవద్దని హితవు పలికారు. అనంతరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత దేశ చరిత్రలో ఒక్క జగనన్నకే దక్కిందన్నారు. పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ఈ పథకాలు నిరంతరం కొనసాగాలంటే, రానున్న ఎన్నికలలో ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. ఎంపీపీ మాత బారతి, పంపన విష్ణు, మేడిశెట్టి చంటి, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోలంకలో మాట్లాడుతున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్. చిత్రంలో సూర్యప్రకాశ్

## అక్షరజ్ఞానంతో అజ్ఞానాన్ని తొలగించుకోవచ్చు

- టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్
- రాయవరంలో సత్కారం

**రాయవరం:** అక్షర జ్ఞానంతో అజ్ఞానాన్ని తొలగించుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. బుధవారం నిర్వహించిన స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.అమ్మిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నైనా జైస్వాల్ మాట్లాడుతూ కృషి ఉంటే ఎవరైనా రుషులుగా మారతారన్నారు. కృషి, పట్టుదల, సాధన ఉంటే అద్భుతాలు సాధించడం కష్టమేమీ కాదన్నారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ, కఠోర సాధన లక్ష్య సాధనకు ఉపకరిస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, కేవీఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తేతల నవీన్‌రెడ్డి, జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, సాయితేజా విద్యానికేతన్ డైరెక్టరు కర్రి సందీప్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం నైనా జైస్వాల్‌ను దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.


టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ ప్రసాద్ తదితరులు

## కర్ణభక్తుల కాలక్షేప మంటపానికి నిధులు

**కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర గ్రామంలో కర్ణ భక్తుల సామాజిక వర్గీయుల కాలక్షేప మండపం నిర్మాణానికి దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు ఉత్తర్వు పత్రాన్ని మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతులు మీదుగా కర్ణ భక్తుల సంక్షేమ సంఘం ప్రతినిధులకు బుధవారం అందజేశారు. సంఘం అధ్యక్షులు, అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, చేనేత సహకార సంఘం చైర్మన్ గుడిమెట్ల శివరామకృష్ణ, మాజీ అధ్యక్షుడు కుడకా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి శలా సుబ్రహ్మణ్యం, సంఘం నాయకులు శలా వీరబ్రహ్మం మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సామాజిక వర్గీయుల దీర్ఘకాలం నాటి ఆకాంక్షను నెరవేర్చిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందన్నారు. సమస్యను చెప్పగానే స్పందించి నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు బాసటగా నిలుస్తామని వారన్నారు.


మండపేటలో నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

## పల్లెల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సోమేశ్వరంలో రూ.3.57 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

**రాయవరం:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. మండలంలోని సోమేశ్వరం గ్రామంలో బుధవారం సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో రూ.3.17 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలు ప్రజా పాలనకు నిలువుటద్దంగా నిలుస్తున్నాయన్నారు. సర్పంచ్ ఆరిఫ్ గ్రామంలో అభివృద్ధికి ఐకాన్‌గా నిలుస్తున్నారంటూ వారిద్దరూ అభినందించారు. సర్పంచ్ ఆరిఫ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి స్ఫూర్తి పొందుతున్నానన్నారు. సోమేశ్వరం పంచాయతీ పురోభివృద్ధిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారం మరువలేనిదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం

సోమేశ్వరంలో రూ.3.57 కోట్ల వ్యయంతో పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. 33/11కేవీఏ సబ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన శెట్టిబలిజ సామాజిక భవనం, రూ.17.50 లక్షలతో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం పనులను ఆయన ప్రారంభించారు.

### దోసారావు, జక్కంపూడి విగ్రహాల ఆవిష్కరణ

సోమేశ్వరం పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన స్వర్గీయ నిమ్మకాయల దోసారావు విగ్రహాన్ని, అలాగే మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆవిష్కరించారు.


సోమేశ్వరంలో సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


మాజీ సర్పంచ్ నిమ్మకాయల దోసారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్సీ తోట ఆదేశం
- కరాచీ సెంటర్‌ను విగ్రహాల సెంటర్‌గా నామకరణం చేయాలని ప్రతిపాదన
- పూలే, వంగవీటి రంగా, వీవీఎస్ఎస్ చౌదరి విగ్రహాల ఏర్పాటుకు నిర్ణయం
- మండపేట బడ్జెట్ సమావేశంలో పలు తీర్మానాలు

**కపిలేశ్వరపురం (మండపేట):** పట్టణ ప్రజలు ఎలాంటి సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చినా వెంటనే పరిష్కరించేలా పని చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరయ్యారు.ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులుగా రెడ్డి రాధాకృష్ణ, సయ్యద్ రబ్బానీ హాజరయ్యారు. బడ్జెట్‌లోని అంశాలను సభ్యులు చర్చించి, ఆమోదం తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చ జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ టిడ్కో ప్లాట్లను లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని, కాలనీలో చేతిపంపులు ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి పాలకవర్గం వెంటనే స్పందించి నిధులను మంజూరు చేసిందన్నారు. సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో కృషి చేసి చేతిపంపులను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. టిడ్కో ప్లాట్లను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఇటీవల నెలకొల్పిన డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద జ్యోతిరావ్ పూలే, వంగవీటి మోహనరంగా, వీవీఎస్ఎస్ చౌదరి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సభ్యులు నిరయించారు. ఎమ్మెల్సీ తోట నిర్ణయాన్ని స్వాగతించి, ఆ సెంటర్‌కు విగ్రహాల సెంటర్‌గా నామకరణం చేయాలని సూచించారు. పశుపోషణ, పౌల్ట్రీ, రైసుమిల్లుల వ్యాపారాభివృద్ధితో పట్టణానికి రాష్ట్ర వ్యాప్త గుర్తింపును తెచ్చిన వీవీఎస్ఎస్ చౌదరి విగ్రహాన్ని నెలకొల్పడం ఆనందాన్నిస్తుందన్నారు.

### రూ. 20 కోట్ల బడ్జెట్ ఆమోదం

రూ.20 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ అంశాలపై చైర్‌పర్సన్ నూక దుర్గారాణి చర్చ నిర్వహించారు. పట్టణ అభివృద్ధి, నిధులు మంజూరు తదితర అంశాలపై మేనేజర్ కనకరాజు వివరించారు. వాటిపై కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు చర్చించి ఆమోదించారు.


మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

## క్లుప్తంగా

### విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


కేదారిలంక యూపీ స్కూల్‌లో విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**కపిలేశ్వరపురం:** మండలంలోని కేదారిలంక ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా బుధవారం అందజేశారు. సర్పంచుల సమాఖ్య మండపేట నియోజకవర్గ అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఉపాధ్యాయుల చేతులు మీదుగా ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు.

### ఖోఖోలో రన్నర్స్‌గా సత్యవాడ విద్యార్థులు


రన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**కె.గంగవరం:** రామచంద్రపురం జూనియర్ కాలేజీలో ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో మండలంలోని సత్యవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వీరికి బుధవారం ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.శివజీవన్ కుమార్, జీహెచ్‌ఎం సత్యరాం, పీడీ పంపన కామేశ్వరి తదితరులు సిల్వర్ మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందించారు.

### ఉత్తమ ఉద్యోగిగా ముద్రగడ చంటి


కృష్ణకుమారి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న చంటి

**కె.గంగవరం:** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన గ్రేడ్-1 కార్యదర్శి ముద్రగడ సత్యనారాయణమూర్తి(చంటి)కి పురస్కారం దక్కింది. ఈ పురస్కారాన్ని బుధవారం జిల్లా కేంద్రమైన అమలాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యదర్శి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు పురస్కారం లభించడంపై ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభినందించారు.

### ఆశ్రమ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం


దివ్యాంగ విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

**రామచంద్రపురం:** ముచ్చుమిల్లి రోడ్డులోని బెతెస్తా న్యూ లైఫ్ దివ్యాంగ ఆశ్రమ పాఠశాలలో అంజన మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ద్రాక్షారామకు చెందిన డాక్టర్ సలాది వెంకటేశ్వరరావు దివ్యాంగ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. పట్టణానికి చెందిన కేవీఆర్ హాస్పిటల్ డాక్టర్ నాగసతీష్‌కుమార్ కోట పిల్లలకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు అలెగ్జాండర్, ప్రిస్కిల్ల దంపతులు వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఉపాధ్యాయ వృత్తితో సామాజిక గుర్తింపు

**కపిలేశ్వరపురం:** ఉపాధ్యాయ వృత్తి సామాజికంగా మంచి గుర్తింపు ఇస్తుందని పలువురు ప్రముఖులు అన్నారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం విద్యా బోధన చేసిన కపిలేశ్వరపురానికి చెందిన గుంటూరు శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడారు. ఎంఈఓ కె.తాతారావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డీవీ రాఘవులు, హెచ్‌ఎం అంగర, రాజు, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, అంగర ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎస్ఎంసీ చైర్మన్ సలా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, నేల సూర్యకుమార్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలందించడం అదృష్టమన్నారు. శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

### ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షలు

**కాజులూరు:** ఏపీ స్టేట్ సెక్రటరీ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి రెండు, మూడు తేదీల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్య, నైతిక, మానవత విలువలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్టు కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాలలో ఫిబ్రవరి రెండో తేదీ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ (నైతిక, మానవత విలువలు) అనే సబ్జెక్టులో, ఫిబ్రవరి మూడో తేదీ ఉదయం పది గంటల నుంచి ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ (పర్యావరణ విద్య) అనే సబ్జెక్టులో పరీక్ష జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేకపోతే త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షకు అనుమతించరని స్పష్టం చేశారు.

### ద్రాక్షారామలో బంద్



నిరసన దీక్ష చేస్తున్న ఆందోళనకారులు

**రామచంద్రపురం రూరల్:** రెండేళ్ల క్రితం ద్రాక్షారామలో మూసివేసిన పీవీఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలను తిరిగి తెరవాలని, పాఠశాల కోసం ఉద్యమించిన వారిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం బంద్ పాటించారు. ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న మాగాపు అమ్మిరాజు మాట్లాడుతూ తనపైనా, మరికొందరిపైనా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్‌లో చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాయపురెడ్డి రాజా, చిక్కాల దొరబాబు, తోట పృథ్వీరాజ్, పెమ్మిరెడ్డి దొరబాబు, పెన్నాడ బుచ్చిరాజు, డేగల వెంకటరమణ, యండమూరి ఈశ్వరరావు తదితరులు సందర్శించారు.

### విద్యతోనే బాలికలకు పురోగతి

**కాజులూరు:** గ్రామీణ ప్రాంతాల్లో బాలురతో సమానంగా బాలికలు విద్య అభ్యసించినప్పుడే భవిష్యత్తులో అన్ని రంగాల్లోను మహిళలు పురోగతి సాధించగలరని తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి అన్నారు. పల్లిపాలెంలో బుధవారం ఐసీడీఎస్ సిబ్బంది జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. సీడీపీఓ మాధవి మాట్లాడుతూ గ్రామాల్లో బాలికా విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. బాలికా హక్కులు, బాలికల శరీర శుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు ఆటల పోటీలు, ర్యాలీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డపాటి భాస్కరరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన

**రామచంద్రపురం:** వీఎస్ఎం అటానమస్ కళాశాల సైన్స్ విభాగాల అధ్యాపకులు, పీజీ, యూజీ విద్యార్థులతో కలిసి స్థానిక మున్సిపల్ పాఠశాలలో బుధవారం సంచార ప్రదర్శన శాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎన్ అలీఅన్సారీ ఈ సంచార ప్రదర్శనశాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రామచంద్రపురం పట్టణంలోని పిల్లవారి హైస్కూల్, చాకలిపేట హైస్కూల్‌లో వీఎస్ఎం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ శాఖలకు చెందిన అనేక ప్రయోగాలను ఆయా పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ హెచ్ఓడీ ఆర్ నాగేశ్వరరావు, కెమిస్ట్రీ చంద్రావతి, బోటనీ ఏ వెంకటలక్ష్మి, జువాలజీ ఏ రాంబాబు, ఆయా శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పలువురికి ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

**కపిలేశ్వరపురం:** మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాల సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. తాతపూడికి చెందిన నూకపెయ్యి శ్రీనివాస్, కాళ్ల ఏసేబు, నల్లూరుకు చెందిన గుడిమెట్ల భ్రమరాంబ, వల్లూరుకు చెందిన బొప్పె వీరగంగమ్మలు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శించారు.